# రాయి-రత్నం

జడ్జీ గిర్రావుగారింటిగేటు తెరిచి లోపలికి అడుగు పెట్టబోయిన రాధారాణికి బత్తెదూడంత నల్లటికుక్క అరుస్తూ ఏమూలనుంచో పరుగెత్తుకుంటూ రావటంతో భయపడి, చటుక్కున ఒకడుగు వెనక్కువేసి గేటు మూసింది.

వెంటనే వాచ్ మెన్ వచ్చి కుక్కను గొలుసుతోలాగి పట్టుకుని "ఎవరి కోసమమ్మా" అడిగాడు.

"బాబుగారి కోసం"

"జడ్జీ బాబుగారు ఇంకా లేచినట్టులేదు. కుక్కను కట్టేసి లోనకెళ్ళి చూస్తానమ్మా" గుర్రుమంటున్న కుక్కను గొలుసుతోలాగి పట్టుకుని లోపలికెళ్లాడు.

ఐదు నిమిషాలలో వాచ్ మన్ వచ్చి "లోనకొచ్చి కూకోమన్నారు. ఆరు ఇప్పుడే వస్తారట." ఆమెను కుర్చీలున్న వరెండాలోకి తీసుకెళ్ళాడు.

ఆ మాటలతో ఆమెకు ప్రాణం లేచివచ్చినట్లయింది. జడ్జిగారంతటి ఆయన తనకు దర్శనమిస్తాడనుకోలేదు. సందేహిస్తూనే వచ్చింది. తనపాత సూట్ కేస్ పట్టుకుని వాచ్ మన్ వెంట వెళ్ళి ఒక కుర్చీలో కూర్చుంది. ఆమె దేహం ఒణకటం మొదలు పెట్టింది. అంత పెద్దమనిషితో మాట్లాడటానికి తనకు చేతనవుతుందా? కుర్చీలో ఒదిగిఒదిగి కూర్చుంది.

"ఏ ఊరమ్మానీది? ఏం పనిమీద వచ్చావు?" ఆయన కుర్చీలో కూర్చుని అడిగేసరికి ఒణుకుతున్న చేతులను జోడించి 'నేనొక అనాథను. తమ పెరట్లో ఉన్న షెడ్ నాకు ఉండటానికి ఇస్తారేమోనని వచ్చాను. దాసిలో ఉండి బయట పని చూసుకుందామని" అన్నది తడి ఆరిపోయిన గొంతుతో.

"నీవు చూస్తే అయినింటి పిల్లవుగా ఉన్నావు. చదువుకునే వయసు, ఏ ఊరమ్మా చెప్పావు కాదు?"

చెప్పడానికి సందేహించింది. ఆలస్యంచేస్తే ఇంటినుంచి పారిపోయి వచ్చిందను కుంటారేమోననుకుని-తడబడుతూ మాది కోనసీమలో ఒక గ్రామమండి"

"మీ నాన్నగారి పేరు?"

"రామజోగయ్యగారండి, చనిపోయి ఆరునెలలయింది."

"అలాగా? మాదీ కోనసీమే. రామజోగయ్య నాతో కూడా మెట్రిక్ వరకు ఆ గ్రామంలోనే చదివాడు. ఇప్పుడా ఊరికి కాలేజి వచ్చిందా?''

"లేదండి"

"మాదగ్గర షెడ్ ఉందని ఎవరు చెప్పారు?"

"నేను చుట్టు పక్కల అడిగితే వారు ధర్మ ప్రభువులు. అడిగితే ఇస్తారని చెప్పారు.''

"అలా సందుగుండా వెనక్కురా. ఈ లోపల మా ఆవిడకు చెప్పి వస్తాన"ంటూ లోపలికి వెళ్ళారు. ఆయనకు ఇంటి సంగతులు అంటించుకునే అలవాటులేదు. ఒకవేళ ఎప్పుడయిగా చెప్పినా తన వాగ్దానాలు చెల్లుతాయన్న నమ్మకమూ లేదు.

వాళ్ళిద్దరూ పెరట్లోకి వచ్చేసరికి ఆ అమ్మాయి కూడా వచ్చింది.

"షెడ్ చూడు నీకు పనికొస్తుందోలేదో?" అన్నారు.

"నేను బాగుచేసుకుని ఉంటానండి'' అంది.

ఆ అమ్మాయిని ఆపాదమస్తకమూ పరిశీలనగా చూస్తున్న పార్వతమ్మకు మనసులో ఒక ఊహ తటిల్లితలా మెరిసింది. ఆశలు అంకురించాయి.

జడ్జిగిరీరావుగారు ఆ కిందటి నెలలోనే రిటైరయ్యారు. ఇంట్లో ఉండేది ముగ్గురు మనుష్యులే-అయినా ఆయన తల్లి పెద్దదయింది. ఆమెకు అన్నీ అందిం చాలి. ఆధునిక సౌకర్యాలతో లంకంత మేడ కట్టారు జడ్జిగారు. ఆయన సర్వీసులో ఉండగా పంటకు ఇంటిపనులకు కారుడ్రైవింగుకూ ప్రభుత్వ నౌకర్లు ఉండేవారు. ఇప్పుడు పనికి ఒకమనిషిని పంటకు ఒకమనిషిని ఆమె పెట్టుకుంది. కాని-తృప్తిగాలేదు. పైన అద్దెకివ్వాలంటే ఆయన కిష్టంలేదు.

"నీకు నచ్చితే ఉండు" అన్నదామె. అంతమామూలుగా మాట్లాడటం ఆమె కలవాటులేదు కాని ఆ అమ్మాయిని చూడగానే అలా అనేసింది.

రాధారాణి వాళ్ళిద్దరికి మరోసారి ఒంగి దణ్ణం పెట్టింది. షెడ్ తలుపులు తెరిచి చూసింది. అంతా చెత్త పడుంది. బూజు దారాలల్లుతున్నట్లుగా షెడ్డంతా అల్లుకున్నాయి.

నౌకరునడిగి ఒక చీపురు తీసుకుని షెడ్డంతా ఊడ్చి బాగుచేసి బావిలోనుంచి నీళ్ళు తోడుకుని అక్కడంతా చల్లింది.

"అమ్మా, నేను బావి వెనక స్నానం చేయవచ్చా?" అనడిగింది ఆమెను.

"చెయ్యమ్మా. అటెవరూరారు" అంది పార్వతమ్మ.

ఇంక చల్లనీళ్ళే అలవాటు చేసుకోవాలని బావిదగ్గరున్న బకెటులోకి నీళ్ళు తోడుకుని వెనకవైపు స్నానంచేసి బట్టలు పిండుకుని షెడ్‌లో ఆరవేసుకుంది. తలదువ్వుకుని బారెడు తలవెంట్రుకలను ముడివేసుకుంది. గుమ్మం దగ్గర నిలబడి "అమ్మా నేనట్లా బైటికి వెళ్ళివస్తానమ్మా" అంటూ షెడ్‌కి తాళంపెట్టి బయలుదేరింది. ఆమె ఎదురుచూడని ఆదరణా నెలవూ దొరికినందుకు కొంత తృప్తి కలిగింది.

అప్పటికి పదిగంటలు దాటింది. హోటలుకెళ్ళి ఏకంగా భోజనం చేసింది. అది అక్టోబరు నెల కాలేజీలలో చేరేటైము దాటిపోయిందనుకుంటా, ట్యూటోరియల్ కాలేజి కోసం తిరిగి ఒకదానిలో చేరింది. అక్కడి ప్రిన్సిపల్ లెక్చెరర్లు చాలా మర్యాదగా ఆదరణతో మాట్లాడారు. అక్కడి రిజల్ట్సు నూటికి నూరు పాళ్ళు ఖాయమని చెప్పారు. ఆమె దానిలో ఫీజుకట్టి బి.ఏలోచేరి మరుసటిరోజునుంచీ వస్తానని చెప్పింది.

తిరిగి వచ్చేటప్పుడు హోటల్లో టిఫిన్ తీసుకుంది. షెడ్‌లో దీపంలేదు. ఒక లాంతరుకొని కిరసనాయిలు పోయించుకుంది. ఒక ఫ్లాస్కుకొని కాఫీనింపించుకుని నాలుగు అరటిపళ్ళుకొన్నది. సామాన్లు సంచిలో పెట్టుకుని అగ్గిపెట్టెతో లాంతరు చేతబట్టుకుని రిక్షాలో ఇంటికి చేరింది.

అప్పటికి నాలుగుగంటలయింది. జంపఖానా పరచుకుని కాసేపు నడుం

వాల్చింది. వచ్చేటప్పుడు కొన్న వారపత్రికతో కొంతసేపు కాలక్షేపం చేసింది. ఆరాత్రికి తను తెచ్చుకున్న కాఫీ అరటిపళ్ళతో కడుపునింపుకుంది.

పడుకుంది కాని ఆమెకు ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

మొన్నటివరకు తమ ఊరిలో ఉంది. జీవితానికి ఒక దారీ తెన్నంటూ కనబడలేదు. గమ్యంలేని బాటసారిలా ఉంది.

రాధారాణి పుట్టినప్పుడు ఇంట్లో వాళ్ళు మహాలక్ష్మి పుట్టిందనుకున్నారు. ఆ యింటికి కొత్త అందం వచ్చిందనుకున్నారు. సుగంధాలతో ఇల్లు ఘుమఘుమ లాడిపోతోందనుకున్నారు. నడక వచ్చిన తరువాత ఆమె కాలిగజ్జెలు ఘల్లుఘల్లు మంటుంటే 'ఆ వచ్చేది మన రాధారాణి' అనుకునేవారు.

రాధారాణి చాలా చురుగ్గా ఉండేది. జడగంటలు వేలాడుతున్న బారెడు జడను ముందు కేసుకుని. పూలబుట్టచేతబట్టుకుని సూర్యోదయాన్ని వెనకబడేస్తూ తరిమెళ్ళవారి పెరట్లో పారిజాతాలు బుట్టనిండా నింపుకుని రెండు మందారాలు వాటిమీద పెట్టుకుని "అమ్మామ్మా, నేను వెళ్ళుతున్నానంటూ పెరటి వాకిట్లోనుంచి వచ్చి వీధివాకిట్లోనుంచి వెళ్ళేది.

ఆమె మాటలు గలగల. కాలిపాంజేబుల రవళి-ఆమె మోసుకు వచ్చిన సువాసనలు ఆ యింటి వారినందరినీ మేలు కొలిపి వాళ్ళులేచే లోపల ఇల్లు చేరుకునేది.

ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకుని చేతులందరికీ చూపించి అట్లతదియ నాడు తెల్లవారుఝామున భోజనంచేసి పెరట్లో చెట్టుకువేసిన ఉయ్యాల స్నేహితు లతో తమయింట ఊగి, అక్కడితో ఊరుకోక, గుంపుగా అందరిళ్ళకూ వెళ్ళి ఊయ్యాలలూగి కిలకిలా నవ్వుతూ గలగలా మాట్లాడుతూ అమ్మాయిలలో కల్లా నాయకురాలిలా ఉండేది.

శ్రావణం వచ్చిందంటే తను ముందు కన్య ముత్తైదువగా నోమునోచుకుని చేతికి కట్టుకున్నతోరణం అందరికీ చూపెట్టి మీరంతా వెనకబడ్డారని హేళనచేస్తూ, వాళ్ళ ఉలికిపాటుతో గడపదాటేది.

ఏ పండగ వచ్చినా పేరంటం వచ్చినా రాధారాణి కిన్నెర కంఠంతో అడగ్గానే రెండు పాటలయినా పాడేది.

ఒక్కతేపిల్ల-ముద్దుమురిపాలతో పెరిగింది. ఆడింది ఆట-పాడిందిపాటగా గడిచింది.

రాధారాణి ఆ ఊళ్ళోనే పెత్తల్లి కొడుకుతోపాటుగా మెట్రిక్ ప్యాస యింది. ఇద్దరు ప్రైవేటుగా ఇంటరు పరీక్షలకు చదివి ప్యాసయ్యారు. రాధారాణికి పెళ్ళి చెయ్యాలని తల్లి ఆరాటపడేది. తండ్రి సంబంధాలు చూస్తుండగానే తల్లికి గుండెపోటువచ్చి కన్నుమూసింది.

భార్యపోగానే రామజోగయ్యకు పిల్లకు పెళ్ళి చేయాలన్న తొందర ఎక్కువయింది. తను ఇటూ అటూ తిరగవలసి వస్తోందని కూతుర్ని ఎక్కువగా పెత్తల్లియింట్లో ఉంచి తాను రాగానే తీసుకువచ్చేవాడు. అతడికిప్పుడు రేపటిమీద నమ్మకం తగ్గుతూ వస్తున్నది. ఆ సంవత్సరం పంటచేతికి రాగానే అమ్మకానికి పెట్టి బేరాలు చేస్తున్నాడు. భార్య నగదూ బ్యాంకులో పెట్టి రాధారాణిని వారసు రాలిగా చేశాడు.

అవి కోతలరోజులు. పంట కోయించాలని భోజనంచేసి టిఫిన్‌కారియర్ నిండా తినుబండారాలు నింపుకుని సైకిలుమీద పొలానికి వెళ్ళాడు. పెత్తల్లికొడుకు రామం వచ్చాడు. రాధారాణీ అతడు బి. ఏ చదవటానికి ప్రణాళికలు వేస్తున్నారు.

"నీవు బి.ఏ పూర్తిచేస్తావన్న నమ్మకం నాకు లేదురాధా" అన్నాడు రామం.

"ఎందుకంటావట్లా? కష్టమనా?"

"కష్టమేంకాదు. అందులో నీకు? మీనాన్న నీకు పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నాడు."

"కుదిరిన్నాడు చూద్దాం"

"అవునుగాని-మీ నాన్న ఇంకా రాలేదు. నేనింటికి వెళ్ళద్దూ?"

"ఈ రోజుకిక్కడే ఉండు. రేపు నిద్రలేవగానే వెళ్ళచ్చు."

"అంతలో పాలేరు వచ్చాడు "అయ్యగారికి పాముకరిచింద"ంటూ.

రామం దిగ్గున లేచాడు. పాలేరునక్కడే ఉంచి, రాధారాణికి ధైర్యంగా ఉండమని చెప్పి, తను వచ్చిన సైకిలు మీద రివ్వున పొలంలోకి వెళ్ళాడు.

ఇంటినిండా దీపాలు వెలిగించుకుని, రాధారాణి నట్టింట మంచమ్మీద తలమీద చేతులు పెట్టుకుని కూర్చుంది.

ఏడుగంటలు దాటింది. రామంజాడలేదు.

ఎనిమిది,తొమ్మిది గంటలు కొట్టింది గడియారం-తన ధర్మాన్ననుసరించి.

తెల్లవారుఝామున ఒక బండిలో రామజోగయ్యను తీసుకుని పొలంలోని నలుగురు మనుష్యులతో రామం వచ్చాడు.

ఊరంతా పోగయ్యారు. తండ్రి దేహంమీదపడి రాధారాణి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయింది. మిగతా కర్మ కాండ రామంతండ్రి జరిపించి రాధను తమ యింటికి తీసుకువెళ్ళాడు.

ఆమెకు దిక్కెవరు? నా అన్నవాళ్ళు రామం కుటుంబం తప్ప మరెవ్వరూ లేరు. ఎవరో ఒకరు రాధారాణి దగ్గర కూర్చుని ఊరడిస్తూ ఉండేవారు. ఆమెకు తన భవిష్యత్తు అయోమయంగా ఉంది.

ఆరునెలలు గడిచిన తరువాత ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది.

"పెద్దనాన్నగారూ, నేను పట్నంవెళ్ళి హాస్టల్లో ఉండి చదువుకుంటాను. ఈ ఊళ్లోఉంటే నాకు పిచ్చిఎక్కేటట్టుగాఉంది."

"ఒక్కదానవూ ఉండి చదువుకోగలవా అమ్మా? అంత ధైర్యం ఉందానీకు?" ఆయనకూ ఎటూ తోచటంలేదు.

"ధైర్యం తెచ్చుకోవాలి-నా భవిష్యత్తును నేనే నిర్ణయించుకోవాలి."

"ఇప్పుడు సంవత్సరంలో సగంఅయిపోయింది. కాలేజీలు తెరవంగానే రామాన్ని తీసుకువెళ్ళు. అన్ని వసతులు నీకు సమకూర్చివస్తాడు. ఈలోగా మీ నాన్న కోరికప్రకారం ధాన్యం పొలం అమ్మకానికి పెడతాను. ఇల్లు ప్రస్తుతానికి ఉండనియ్యి. అద్దెకిచ్చి నెలనెలా నీకు పంపుతాము. ఎప్పుడైనా మేమువచ్చి చూస్తాము. నీవుమాత్రం సెలవులకు ఇక్కడికి రావాలి."

రాధారాణికి ఆ ప్లానునచ్చింది. ఈ లోపల సంగీతం మాస్టరుగారు ఇది వరకు మాదిరిగానేవచ్చి పాఠాలునేర్పుతున్నారు.

ఒకరోజు రామం స్నేహితుడు నరసింహ వచ్చాడు.

"ఏమిటలా చెప్పాపెట్టాకుండా ఊడిపడ్డావు?" లోపలికి తీసుకుపోయి అతడిని తల్లికి చూపించాడు రామం. ఆమె అతడిని గుర్తుపట్టింది. ఆరోజు అతడు వచ్చాడని విందుభోజనం తయారుచేసింది.

ఆ సాయంకాలం ఏడుగంటల రైలుకు నరసింహ వెళ్ళిపోతాడు. రామం తల్లి అతడికన్నీ ఏర్పరచి "నాయనా గుళ్ళోపూజలు జరుగుతున్నాయి. చూసి వస్తాము" అంటూవెళ్ళింది.

రామం రాధారాణిని తన స్నేహితుడికి పరిచయంచేశాడు. ఆమె తనకు చెల్లెలవుతుందనీ ఇంకా పెళ్ళి కాలేదనీ చెప్పాడు.

రాధారాణిని చూడగానే నరసింహకళ్ళు జిగేలుమన్నాయి.

"రామం నేను జర్మనీ వెళ్ళుతున్నాను. రెండేళ్ళకు వస్తాను. ఈమెను నేను పెళ్ళిచేసుకుంటాను. ఆమెకు ఇష్టమేనోకాదో అడుగు" అన్నాడు.

"విదేశాలకువెళ్ళే నిన్నునమ్ముకుని అంతవరకూ పెళ్ళి చేసుకోకుండా ఉండమంటావా? ఏంమాటలురా! వారం రోజులుండి పెళ్ళి చేసుకువెళ్ళు నీ కిష్టమయితే"

"ఒరే రామం నాకు వీసావచ్చింది టికెట్ కొన్నాను. టైములేదురా ఏం రాధారాణీ నాకోసం ఆగలేవా?" సూటిగా అడిగాడు.

ఆమె తలవంచుకుని ఇష్టమేనన్నట్టు ఆగుతానని చెప్పింది.

"అయితే ఇదే వాగ్దానంగా నీవేలిఉంగరం నాముందర ఆమె వేలికిపెట్టు. సగంపెళ్ళి అయినట్లనుకుంటాను. మాటతప్పావో నీకు మర్యాదదక్కకుండా చేస్తాను" అన్నాడు రామం మందలింపుగా.

నరసింహకు రైలువేళయింది. ఒకరికొకరు కళ్ళతో వీడ్కోలిచ్చుకున్నారు. అతడు వెళ్ళిపోయాడు.

రాధారాణి ఆ ఉంగరాన్ని పొద్దున్నే లేచి కళ్ళ కద్దుకునేది. వేలికి పెట్టుకోకుండా తన మెడలోఉన్న చిన్నగొలుసులోకి ఎక్కించింది. ఇప్పటినుంచి దాని సంగతి అందరికీ చెప్పద్దని రామంకి కట్టడిచేసింది.

చూస్తూఉండగానే కాలేజి తెరిచేరోజులు వారంలోకివచ్చాయి. రామంకూడా వెళ్ళి సంవత్సరానికి సరిపడాడబ్బు బ్యాంకిలో ఆమె పేరున ఎకౌంటు పెట్టాడు. హాస్టలు పరిస్థితి ఆమెకు నచ్చలేదు. ఎవరింట్లోనయినా ఒక గది అద్దెకు తీసుకుంటానని చెప్పి రామాన్ని పంపించేసింది. చివరకి షెడ్డులో చేరింది.

తెల్లవారగానేలేచి కళ్ళుతుడుచుకుని తలవెంట్రుకలు సర్దుకుని బైటికివచ్చి ముఖం కడుక్కుని స్నానంచేసింది. మామూలుగా బట్టలు ఆరవేసుకుని బైటికి బయలుదేరింది. ఆమె తనకు కాలేజికి అవసరమైన పుస్తకాలు కాగితాలు వంటివి కొనుక్కుని హోటల్లో భోజనంచేసి కాలేజికివెళ్ళింది.

కాలేజి షిప్టు సిస్టమ్ ప్రకారం నడుస్తోంది. మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచీ మూడు గంటలవరకూ బి.ఏ. క్లాసులు నడుస్తాయి.

రాధారాణి కాలేజినుంచి వచ్చేటప్పుడు తనకు కావలసినవస్తువులు కొనుక్కుని ఇంటికివచ్చి చదువుకుంటుంది. పత్రికలు తెచ్చుకుంటూఉంటుంది. సెలవులు వచ్చినప్పుడు ఆమె ఊరికివెళ్ళి రామం వాళ్ళను చూసివస్తున్నది.

కాలచక్రం తిరుగుతున్నది. ఎటువంటి ఆటంకంలేకుండా ఒక సంవత్సరం దాటింది. రెండవసంవత్సరంలోకి వచ్చింది.

ఒకనాడు పార్వతమ్మకు ఒంట్లో బాగాలేదనీ వంటమనిషికి కాఫీ సరిగా చెయ్యటంరాదనీ పనిమనిషిద్వారా విన్నది రాధారాణి. చప్పున లోపలికివెళ్ళి "అమ్మా నాకు ఇప్పుడే తెలిసింది. కాఫీ చేసి తీసుకువస్తా"నని వంటయింట్లోకివెళ్ళి అరగంటలో కాఫీచేసి ఆమెకు తెచ్చియిచ్చింది

"అమ్మాయీ బాబుగారు మా అత్తగారు పైనున్నారు. వాళ్ళకుకూడా తీసుకెళ్ళి ఇవ్వమ్మా" అన్నది పార్వతమ్మ. రాధారాణి చెంబులో కాఫీ పోసుకుని రెండుగ్లాసులు తీసుకుని పైకి వెళ్ళింది.

అప్పటికి జడ్జిగారు ముఖంకడిగి పేపరు చదువుతూ వరెండాలో పడకుర్చీలో కూర్చున్నారు.

"బాబుగారూ కాఫీ తీసుకోండి" గ్లాసందించింది,

"నీవు తీసుకువచ్చావేమిటి? పార్వతి లేవలేదా?" ఆశ్చర్యంతో అడిగారు.

"అమ్మగారికి ఒంట్లో బాగాలేదని తెలిసి నేను చేసి తీసుకువచ్చాను" అన్నది.

"కాఫీ ఇవాళ చాలాబాగుంది సుమా? నీకు కాఫీచెయ్యటంకూడా వచ్చునన్న మాట. చూడమ్మా ఆగదిలో మాఅమ్మ ఉంటుంది ఆమెకుకూడా ఇచ్చిరా అమ్మా" అన్నాడు.

జడ్జీగారితల్లి పెద్దది. కళ్ళుసరిగాకనబడవు. ఆమెను ఒకరు లేవదీసి కూర్చో బెట్టాలి పనిమనిషి ముఖం కడిగించివచ్చింది. ఆమెనులేపి కూర్చోబెట్టటం రాధారాణికి చేతకాలేదు. కిందికివెళ్ళి పనిమనిషిని పిలిచింది. ఇద్దరూ కలిసి కాఫీ తాగించారు. రెండురోజులు గడిచిన తరువాతకూడా వంటమనిషి రాలేదు.

రాధారాణి స్నానంచేసి వంటచేసింది. తొమ్మిదిగంటలకు జడ్జీగారి తల్లికి భోజనంపెట్టాలి. అప్పటికి పనిమనిషి ఆమెకు స్నానంచేయించి భోజనాల బల్ల దగ్గర కుర్చీమీద కూర్చోబెట్టింది. రాధారాణి పనిమనిషి చెప్పినట్టుగా పళ్లెంలో అన్నీవడ్డించి పులుసు పెరుగు చిన్నగిన్నెలలో పోసుకుని పైకివెళ్ళి ఆమె భోజనం అయేవరకూ అక్కడే ఉన్నది.

"అమ్మాయీ ఇవాళ వంటమనిషిరాలేదా? నీపేరేమిటి? ఎవరింటి అమ్మాయివి? వంట మహారుచిగాచేశావు. ఎక్కడుంటావమ్మా?" వివరాలన్నీ అడిగింది.

"నేను మీయింట్లోనే ఆ షెడ్డులోఉంటూ పనిచేసుకుంటున్నానండి" అన్నది రాధారాణి.

"అలాగా నాకు తెలియదమ్మా. పనిచేసుకుంటూ వంటబాగా చేశావమ్మా. నీకు తీరికగాఉన్నప్పుడువచ్చి నా దగ్గరకూర్చో. ఏమీతోచదు రేడియో వింటాను కాని-మనిషితోమాట్లాడినట్టుగా ఉండదు" అంది ఆప్యాయంగా.

"అలాగేలెండి"

ఆనాడందరూ వంటబాగుందని మెచ్చుకున్నారు. పార్వతమ్మతోసహా

అందరికీపెట్టి వంటయిల్లు శుభ్రంచేసి "నేను మళ్ళీ మూడుగంటలకువచ్చి కాఫీ టిఫిను చేస్తాను. బామ్మగారికి ఒకకప్పు కాఫీచేసి ఫ్లాస్కులోపోసి మంచందగ్గర పెట్టాను. బాబుగారూ మీరయినా గ్లాసులోపోసి తాగించండి" అంటూ వెళ్ళిపోయింది.

పార్వతమ్మ మందులేసుకొని హాయిగా నిద్రపోయింది. బామ్మగారు ఏవో పాటలుపాడుకుంటూ కొడుకు వేళకుఇచ్చిన కాఫీతాగారు. జడ్జిగారు పడక్కుర్చీలో కునికిపాట్లుపడుతూ నాలుగుగంటలవరకూ కాలక్షేపం చేశారు.

సరిగ్గా నాలుగయిందో లేదో కాఫీ అకుకూరవేసి బజ్జీలపళ్ళెం జడ్జిగారి ముందరపెట్టి "బాబుగారూ! కాఫీ తీసుకోండి" అంది.

"ఆఁ ఎప్పుడువచ్చావమ్మా? ఇవన్నీ ఎప్పుడు చేశావు?" అంటూ ముందుగా కాఫీగ్లాసు చేతిలోకి తీసుకున్నారు. పార్వతమ్మ అప్పుడేలేచి కాఫీ తాగుతూ "చూడమ్మాయీ, నా సుస్తీఅంతా ఒకపూట విశ్రాంతితో మాయమయింది" అంది.

బామ్మగారిని రుచిచూడమని నాలుగు బజ్జీలువేసిన పళ్ళెం చేతబట్టుకుని ఒక్కొక్కటి ఆమెచేత తినిపించింది రాధారాణి.

పార్వతమ్మకు సుస్తీచేయటం, వంటమనిషి రాకపోవటం ఇదివరలో ఎన్నిసార్లో జరిగింది. కాని ఇంత ప్రశాంతంగా సుఖంగా రోజులు గడవలేదు.

వంటమనిషి ఈసారి పదిరోజులు వరసగా మానేసింది. ఆమె డ్యూటీ అంతా రాధారాణిచేసింది. పార్వతమ్మ ఏపని చేయబోయినా "అమ్మా మీరు విశ్రాంతి తీసుకోండి" అని అక్కడినుంచి పంపించేది రాధారాణి.

"ఇంకా వంటమనిషిరాలేదూ? పాపమాఅమ్మాయి బయట పనిచేసుకునేపిల్ల. ఎన్నాళ్ళని ఇలా పనిచేయించుకుంటాం ఆ అమ్మాయిచేత?" అన్నారాయన పార్వతమ్మతో.

"మరేంచెయ్యమంటారు? నాకా ఓపికలేదు. వంటమనిషి ఎవరయినా దొరుకుతారేమోనని చూశాను. ఎవరూదొరకలేదు చెయ్యనివ్వండి ఆ అమ్మాయిని. అరిగిపోతుందా? ఊరికే ఉంటోంది అంత షెడ్డులో" పార్వతమ్మ మనసులోమాట బయట పెట్టింది

"అది చెదలుపట్టిన కట్టెలగది చెత్తాచెదారంతో నిండిఉంది. పాపమా అమ్మాయి నీళ్ళగదిలోకయినా రాకుండా చన్నీళ్ళే స్నానంచేస్తూ కాలం గడుపు కుంటోంది ఆ షెడ్‌లో దానికీ దీనికీ ముడిపెడతావా? అసలింతకూ ఇంతమందికి వండిపెట్టిన అమ్మాయి భోజనమైనాచేసిందా మనయింట్లో? గ్లాసెడు కాఫీ అయినా తాగిందా? నీవు కనుక్కున్నావా?" జడ్జీగారి మనసులో రాధారాణిపట్ల మొదట ఆమెను చూడగానే కలిగిన వాత్సల్యం ఇప్పుడు బయటపడ్డది.

"వంటచేసినపిల్ల తినకుండాఉన్నదా? కాఫీ అందరికీ అందించినపిల్ల తాగ కుండా ఉందా?" అని లౌకికమయినమాట ఆమె నోటివెంట వెలువడ్డది.

''అమ్మాయి వచ్చినప్పుడు అడిగిచూడు"

రాధారాణిని ఆమాట అడగటానికి పార్వతమ్మకు అభిమానమనిపించింది.

ఇలాగ రోజులు గడిచిపోతున్నాయి. వాళ్ళయింట్లో వంటమనిషి కుదర లేదు. రాధారాణి టైమ్‌ప్రకారం వంటపనీ, కాఫీ టిఫిన్లు చేస్తునేఉంది. రాధారాణి ఇంటిమనిషికింద కాలేదుకాని వంటమనిషికింద మారిపోయింది.

ఒకటి రెండుసార్లు రామం కాలేజిదగ్గరకేవచ్చి చూసివెళ్ళాడు. అనుకున్న రెండు సంవత్సరాలు గిర్రునతిరిగినట్లయింది. రాధారాణి ఫస్టున ప్యాసయింది. కాలేజీలు తెరవగానే లా కాలేజిలో చేరింది. అక్కడ లైబ్రరీలో పుస్తకాలు చదువు కుంటూ ముఖ్యాంశాలు నోటుబుక్‌లో రాసుకుని రాత్రింబగళ్ళు చదివింది.

రాధారాణికి వంటపని బాగా అలవాటయి ఇప్పుడు అంత కష్టమనిపించటం లేదు. అందరూ చెప్పిచేయించుకుంటున్నారు.

ఆరోజు రాధారాణి యింటికి వచ్చేటప్పటికి ఇంట్లో అంతా సందడిగా మాట్లాడుకుంటున్నారు.

"అబ్బాయికి సౌకర్యంగా ఉండకుండా మేడ అద్దెకిచ్చి కూచున్నారు. ఇప్పుడు వాడెక్కడుంటాడు? ఎవరిచ్చిన సలహామీకు?"

"నాకెవరు సలహాయిస్తేఏమీ? నెలకు పదిహేనువందలు వస్తున్నాయా? లేదా? ఇదివరలో ఇద్దరు పనిమనుష్యులు చేసేపని ఒక్కపనిమనిషిని చెయ్యమంటే అది నాగాలు పెడుతోంది. పైన గదులన్నీ దుమ్ముతో నిండి ఉండేవి. అమ్మకు

మేడమీద ఆ గదిలో ఒంటరిగా ఉండటమంటే కష్టంగా ఉంది. ఆమె పిలిచినప్పుడు పనిమనిషి పైకి వెళ్ళాలి. కాని అట్లా జరగటంలేదు. ఇప్పుడేమయింది? దక్షిణం వైపు రెండుగదులూ ఆ వరెండా బాత్‌రూమూ వాడుకుంటాడు. ఆదేశంలో మాత్రం వాడికి అంతకంటె పెద్దఇల్లు దొరికిందా? అయినా వాడు ఉండేది ఎన్నాళ్లో? మళ్ళీ ఎక్కడికి ప్రయాణం కడతాడో?" అన్నారు.

ఆ సాయంత్రం ఆ గదులు శుభ్రంగా కడిగించి అవసరమయిన సామాన్లు సర్దించారు వాటిల్లో.

మరునాడే కొడుకు వస్తున్నాడని జడ్జీగారు చాలాసంబరంగా ఉన్నారు. పార్వతమ్మ ఏమేమివంటలు చేయించాలా అని ఆలోచిస్తున్నది. ఆమెకు అతడంటే ప్రాణం.

ఎనిమిదిగంటలకు అబ్బాయి వస్తాడనుకుంటూ అందరూ స్నానాలుచేసి కాఫీ టిఫిన్లు తీసుకోకుండా కూర్చున్నారు.

"స్పెషల్‌గా వంట అతిరుచిగా చెయ్యాలమ్మాయీ"అని కూరలూ సామాన్లూ తెప్పించి పెట్టింది పార్వతమ్మ.

రాధారాణి ఆరోజు ఇడ్లీసాంబారుచేసి బల్లమీద పెట్టింది. కెటిల్లోపోసి కాఫీ పెట్టింది. ప్లేట్లు చంచాలు గ్లాసులు అన్నీ బల్లమీద అమర్చింది. పార్వతమ్మ చెప్పిన వంటకాలన్నీ చేసింది. బామ్మగారికి భోజనంపెట్టి తానారోజు తొందరగా వెళ్ళాలని అందరితో చెప్పి వెళ్ళిపోయింది.

రాధారాణి చదువుకుంటున్నదని వాళ్ళనుకోవటంలేదు ఆమె ఏదో పని చేసుకుంటుందనుకుంటున్నారు. అక్కడ ఆలస్యమైనా ఇక్కడ వేళకు చేయమని ఇంటిఇల్లాలి తొందర.

సాయంత్రం రాధారాణి వచ్చేసరికి ఇంట్లో అందరూ కార్లో బయటికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నారు. పార్వతమ్మ కాఫీ మాత్రంచెయ్యమని రాధారాణికి చెప్పింది. బల్లమీద పెట్టిన కాఫీ అందరూ తీసుకుని ఇల్లు తాళంవేసి సాయంత్రం ఆరుగంటలకు వస్తాము, వంటఇల్లు తెరిచే ఉంటుంది. వంటరెడిగా ఉంచు" అంటూ కారెక్కింది పార్వతమ్మ.

కొడుకు వచ్చిన తరువాత పార్వతమ్మ అన్నీ బల్లమీద పెట్టించుకుని తానే వడ్డన చేస్తున్నది.

రాధకు రెండోసంవత్సరం పరీక్షలు కూడా అయ్యాయి. రామం ఇంటికి రమ్మనమని చెప్పివెళ్ళాడు. రాధ వెళ్తాననగానే పార్వతమ్మకు చికాకనిపించింది.

"అబ్బాయి ఇంట్లో ఉన్నాడు. నీవిప్పుడు వెళ్ళకపోతేనేం?" అన్నది కోపంతో.

"వెళ్ళాలి. మా పెత్తల్లిని చూసి చాలా రోజులయింది. బెంగపెట్టుకుందిట. తొందరగా వస్తాలెండి" అని బయలుదేరింది.

రాధారాణి అనుకున్నట్టుగారాలేదు. పెత్తండ్రీ రామం సెలవుల్లో ఉండిపొమ్మన్నారు. పెత్తల్లి ఆమెను వదలిపెట్టలేదు. ఆమె అక్కడ ఉండగానే పరీక్షా ఫలితాలు తెలిశాయి. రామానికి పెళ్ళిచేశారు. అమ్మాయి ఎక్కువగా చదువుకోకపోయినా తెలివిగలది. చూడటానికి బాగుంటుంది. మంచి, మర్యాద మార్గాలు తెలిసినమనిషి. పెళ్ళిలో అంతా తానేఅయి తిరిగింది రాధారాణి.

"అమ్మాయీ, నీకు సంబంధాలు చూడాలనుకుంటున్నానమ్మా. పరీక్షలయ్యాయి కదా?" పెత్తండ్రి అడిగాడు.

"ఆలోచిద్దాం, నేను ఎడ్వకేటుగా ఎన్‌రోల్ కావాలి. ఎవరయినా పెద్ద లాయరు దగ్గర జూనియర్‌గా పనిచెయ్యాలి. కొంతటైంపడుతుంది" అన్నది రాధారాణి

అసాయంత్రం తల్లి కోడలితోటి గుడిలోకి వెళ్ళినప్పుడు అడిగాడు రామం-'నరసింహ విదేశాలనుంచి వచ్చాడా? నీకేమయినా అతడి సంగతి తెలిసిందా?" అని.

"నాలుగు సంవత్సరాలయింది. అతడి సంగతి నాకేం తెలియదు. అతడి విషయం నీవు రాశావుగా?"

"తిరిగి వచ్చాడోలేదో? అక్కడే ఉండిపోతాడేమో? పెళ్ళిచేసుకున్నాడా ఏమిటి?"

"ఏమో. మనకేం తెలుసు? అయినా నన్ను సెటిల్ కానీ ముందర."

రాధారాణి తిరిగి వచ్చేసరికి ఒక వంట మనిషిని పెట్టుకున్నారని తెలిసింది.

వాళ్ళబ్బాయికి పెళ్ళి అయింది. అక్కడే ఒక ఫారెన్ కంపెనీలో ఉద్యోగం దొరికింది. మేడ ఖాళీచేయించి కొడుకూకోడలికి ఇచ్చారు. బామ్మగారు పోయారని తెలిసింది. రోజూ రాధారాణిని తలుచుకునేదట పనిమనిషిచెప్పింది.

ఒక సాయంత్రపువేళ జడ్జీగారు లాన్‌లో పార్వతమ్మా కొడుకుతో మాట్లాడుతున్నారు.

అప్పుడు రాధారాణి సంశయిస్తూ 'తాను రావచ్చునా' అని అడిగి జడ్జీగారి సమీపంలో ఒకకుర్చీలో కూర్చుంది.

"బాబుగారూ, నేను లా ప్యాసయ్యాను. లాయర్‌గా ఎన్‌రోల్ అయ్యాను. మీకు తెలిసినలాయరు దగ్గర నన్ను జూనియర్‌గా పెట్టండి" అని కోరింది.

"అలాగే, నీవు లా ఎప్పుడు చేశావు? చెప్పావుకాదేం? ఎప్పుడడిగినా ఏదో పని చేస్తున్నానని చెప్పేదానివి?" ఆయన ఆశ్చర్యపడ్డారు. తరువాత ఆ అమ్మాయి చేత నాలుగేళ్ళు ఇంటిపనంతా చేయించుకున్నందుకు సిగ్గుపడ్డారు. భార్యను కోప్పడ్డారు ఆమెను వంటమనిషిగా చూసినందుకు.

"చూడు పార్వతీ, రాధారాణి లా ప్యాసయిందిట. తను చదువుకుంటున్నట్టే మనకు చెప్పలేదు. రాధారాణీ. ఇతడు నరసింహ మా అబ్బాయి. జర్మనీలో చదివిన పెద్ద సైంటిస్టు. ఇక్కడ, వాళ్ళదే కంపెనీలో పనిచేస్తున్నాడు" పరిచయం చేశాడు.

ఆమె ఆయనకు నమస్కారం చేసింది.

అప్పుడే అతడి కంట పడింది ఆమె వేలికున్న తన పచ్చల ఉంగరం. ఉలిక్కి పడ్డాడు.

అతడు చూసినప్పటికంటె రాధారాణి మరింత అందంగా హుందాగా ఉంది. అతడు ఆమెకు ప్రతి నమస్కారంచేసి "గ్లాడ్ టు మీట్ యూ" అన్నాడు.

కొంత సేపయిన తరువాత ఆమె వెళ్ళిపోయింది.

"ఈ అమ్మాయేరా మన షెడ్‌లో ఉంటోంది నాలుగేళ్ళ నుంచీ, మంచి పని మంతురాలు. మనింట్లో వంట చేసేది. కాఫీ టిఫిన్లు చేసేది. బామ్మకు దగ్గరుండి అన్నం పెట్టేది. రత్నంలాంటిపిల్ల" అన్నాడు కొడుకుతో.

"లంకంత యిల్లుంటే ఒక గది ఇవ్వకపోయ్యారా? చదువుకునే అమ్మాయికి-ఆ చెత్తలేసిన గది ఇవ్వకపోతే?" అన్నాడు నరసింహ-కలవరపడిన మనస్సుతో.

"దమ్మిడీ అద్దెలేకుండా ఉంది. ఏదో పెరట్లో ఉందికదా అని ఇంట్లో వంటా అదీ చేస్తుంటే ఊరుకున్నాను" అంది పార్వతమ్మ తేలిగ్గా.

నరసింహ మాత్రం రాధారాణినీ ఆమె వేలికున్న ఉంగరాన్నీ తలుచుకుని ఆ రాత్రంతా జాగరణచేశాడు. తను ఆమెను పూర్తిగా మర్చిపోయాడు? పైగా ఏమీ జ్ఞాపకం లేనట్టుగా లక్షరూపాయల కట్నంతో ఒక మామూలు పిల్లను చేసుకున్నాడు.

ఆమె తెలిసే ఈ యింటికి వచ్చి ఉన్నదా? ఇంట్లో పనిపాటలు చేసిందా? తను వస్తాడన్న ఆశతోనా?

అతడి తల గిరగిర తిరిగిపోయినట్లవుతోంది.

ఒకరోజు కోర్టుకువెళ్ళి క్షమాపణ చెప్పుకోవాలనుకున్నాడు. కాని ఏమని?

అతడికి తనపనిమీద ఆసక్తి చచ్చిపోయింది మనిషిలో మునుపటి ఆనందం ఉత్సాహంలేవు.

కాలం గిర్రున ఏడాది తిరిగింది. విదేశంలో ఉన్న రాధారాణి దగ్గరనుంచి అతడికి ఒక ఉత్తరం ఒక చిన్న పార్సెలు వచ్చాయి ఒకనాడు.

మరిచిపోయిన మీ ఉంగరం తిరిగి పంపుతున్నాను. నేను రాక్‌ఫోర్డులో ఒక కంపెనీలో పనిచేస్తున్నాను. వెళ్లేముందర మీ యింటికి వచ్చి మీ తల్లిదండ్రుల దగ్గర సెలవుతీసుకునే బయలుదేరాను. సెలవు రాధారాణి.

తను విస్మరించిన కర్తవ్యాన్ని ఒక మనిషిగా ఇప్పుడు మరచిపోలేకుండా ఉన్నాడు-నరసింహ.

అతడి విజ్ఞానకోశంలో ఒకభాగం చచ్చుపడిపోయినట్లయింది.

కాని తెల్లవారగానే అదంతా ఒక కలగా మారిపోయింది.

"తను ఆమెకేమయిన మెడలో పుస్తెకట్టాడా? ఏదో సరదాకి ఒక ఉంగరం వేలికి పెట్టాడు. అంతే."

ఆడపిల్లలు కాస్త నవ్వుతూ మాట్లాడితే ఆశలు పెంచుకుంటారు. అది మగవాడికెంత తలనొప్పో గ్రహించరు. ఇందులో తన తప్పేముంది? "ఉంగరం తిరిగి పంపించటం మంచిదే అయింది. ఆమె తన స్థానమేమిటో తెలుసుకుందన్న మాట" అనుకున్నాడు.

ఆ సాయంత్రం అతడు ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి అతడు అగ్నిసాక్షిగా వివాహమాడినభార్య తన పాతప్రియుడైన డ్రైవరుకు ప్రేమలేఖరాస్తూ కనబడ్డది.

అతడి హృదయంలో మళ్ళీ రాధారాణి స్థానం మార్పుచెందింది కాని-లాభం?